క్లుప్తంగా

గ్రేటర్ వరంగల్‌కు కమిషనర్‌ను నియమించండి


వినతిపత్రం చూపుతున్న హరిశంకర్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్‌కు వెంటనే ఐఏఎస్ కమిషనర్‌ను నియమించాలని బీజేపీ వరంగల్ ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్‌కు శనివారం దరఖాస్తు అందజేశారు. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌కు కమిషనర్ లేకపోవడం వల్ల అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయని, పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని పేర్కొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో బైక్ యాత్రలు



నయీంనగర్: ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతిబాపూలే, ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతుల సందర్భంగా ఏప్రిల్ మాసాన్ని మహనీయుల మాసంగా ప్రకటించి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బైక్ యాత్రలు చేపట్టనున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మనువాదాన్ని ప్రతిఘటించి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని సూచించారు. రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు బైక్ యాత్రలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఓరుగంటి సాంబయ్య, కావ్యశ్రీ, రాజేందర్, నారాయణ, రాంకీ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు హర్షణీయం


మాట్లాడుతున్న బక్క దానయ్య

హన్మకొండ: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో 125 అడుగుల ఎత్తైన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడంపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. హనుమకొండ బాలసముద్రంలో అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి బక్క దానయ్య, ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటు, సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు హోమియో వైద్యశిబిరం


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నయీంనగర్: హోమియో వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతిని పురస్కరించుకొని ఓరుగల్లు హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన హంటర్‌రోడ్డులోని దివ్య భవన్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు బీమగాని లక్ష్మీనారాయణ తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.సుధాకర్‌రావు, డాక్టర్ నామసాని రాంబాబు, డాక్టర్ కె.రేవతి, డాక్టర్ పావుశెట్టి శ్రీధర్, వివి.రెడ్డి, బాసాని శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: ఒకటవ డివిజన్ ఎర్రగట్టు నారాయణనగర్‌కు చెందిన వి.లక్ష్మణ్‌కు మంజూరైన రూ.60 వేల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును హనుమకొండలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే అరూరి రమేష్ శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నరేడ్ల శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మణీంధర్‌నాథ్, నాయకులు నంది శ్రీనివాస్, మూల దేవేందర్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో కుక్కలు!

- నగరంలో అధికమైన శునకాల బెడద
- నిత్యం పలుచోట్ల జనంపై దాడులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


ప్రధాన రహదారిపై తిరుగుతున్న వీధి కుక్కలు


కుక్కల దాడిలో గాయపడిన యువకుడు


గాయం చూపుతున్న చిన్నారి


సీసీ ఫుటేజీలో నమోదైన కుక్కల దాడి

హసన్‌పర్తి: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల బెడద అధికమైంది. ఈక్రమంలో రోజురోజుకు కుక్కల దాడులు పెరిగిపోతున్నాయి. దాంతో పలువురు గాయాలపాలై ఆస్పత్రిలో చేరుతున్నారు. ముఖ్యంగా నగరంలోని 1, 2, 55, 56, 65, 66 డివిజన్లలో కుక్కల దాడులు అధికయ్యాయి. భీమారం శివారులోని బస్వరెడ్డి టౌన్‌షిప్‌లో కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్లు చేసి అక్కడే వదిలేయడంతో ఆ పరిసర ప్రాంతాల్లో అవి స్వైర విహారం చేస్తున్నాయి. 55వ డివిజన్ భీమారంలో ఇటీవల కుక్కల దాడిలో పదిమంది గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. అలాగే 66వ డివిజన్ హసన్‌పర్తిలోని పలు కాలనీల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ దాడి చేస్తున్నాయి. ఈక్రమంలో పాఠశాలలకు వెళ్లాలంటే విద్యార్థులు, పని నిమిత్తం బయటకు వెళ్లాలంటే పెద్దలు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే, ద్విచక్ర వాహనదారులను వెంబడించి శునకాలు దాడి చేస్తున్నాయి. ఎర్రగట్టు గుట్ట ప్రాంతంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది.

చికెన్ సెంటర్‌లోకి దూసుకెళ్లి..

నగరంలోని ఓ చికెన్ సెంటర్‌లోకి కుక్క దూసుకెళ్లి చికెన్ సెంటర్ నిర్వాహకుడి పాటు మరో ఇద్దరు వినియోగదారులపై దాడి చేసింది. ఆ ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. అలాగే, ఓ కిరాణం షాపులోకి కుక్క దూసుకెళ్లి ఓ అమ్మాయిపై దాడికి దిగింది. ఇటీవల జయగిరి గ్రామంలో ఇంటి ఆవరణలో ఆరేళ్ల బాలిక ఆడుకుంటుండగా చిన్నారిపై కుక్క దాడి చేసింది. ఆ సమయంలో బాలిక కేకలు వేయడంతో తల్లిదండ్రులు ఇంటిలో నుంచి పరుగున వచ్చారు.

ఫోన్ చేసినా స్పందించని అధికారులు

కుక్కలు దాడులు చేసి గాయపరుస్తున్నాయని అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులకు చెప్పినా వినిపించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కుక్కల జనన నియంత్రణ కోసం భీమారం శివారులోని బస్వరెడ్డి టౌన్‌షిప్‌లో ఆపరేషన్ చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి కుక్కలను తీసుకొచ్చి ఆపరేషన్ చేసిన అనంతరం వాటిని అక్కడే వదులుతున్నారు. దీంతో అవి చింతగట్టు క్యాంప్, ఎర్రగట్టు, భీమారం, రామారం, హసన్‌పర్తి గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడికి పాల్పడుతున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పెన్షనర్ల డిమాండ్లు నెరవేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ఖిలా వరంగల్: ప్రభుత్వ పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల(పెన్షనర్స్) దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా ఈనెల 10న వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న నిరసన దీక్షకు పెన్షనర్లు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం శివనగర్‌లో జిల్లా అధ్యక్షుడు పాద సోమయ్య అధ్యక్షతన ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్ల సమావేశం శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అనేక రకాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాద సోమయ్య, లక్ష్మారెడ్డి, యూనిట్ కార్యదర్శి వరయోగుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఘటన పోరాట యోధురాలు బేబక్క


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: ప్రతిఘటన పోరాట యోధురాలు బేబక్క అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు అన్నారు. బేబక్క సంతాప సభను జయప్రదం చేయాలని పార్టీ ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంబంధిత వాల్‌పోస్టర్ల వరంగల్ చౌరస్తాలో శనివారం ఆవిష్కరించారు. ఈనెల 10న నర్సంపేటలోని వాసవి కల్యాణ మండపంలో సంతాప సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలో పార్టీ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు గోవర్దన్, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్యతో పాటు వివిధ ప్రజా సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి కృష్ణ, బండి కోటేశ్వరరావు రాచర్ల బాలరాజు, గంద్రాతి హరిబాబు, ఇనుముల కృష్ణ, ఎండి.అక్బర్, బండి రవి, కుమారస్వామి, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు ప్రభుత్వ రంగ సంస్థలు



హనుమకొండలోని అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


వరంగల్ చౌరస్తా: వరంగల్ హెడ్ పోస్టాఫీస్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

హన్మకొండ: ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీలకు ప్రధాని నరేంద్ర మోదీ కట్టబెడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టి.ఉప్పలయ్య, సౌత్ మండల కార్యదర్శి మంద సంపత్ విమర్శించారు. మోదీ హైదరాబాద్‌కు రావడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం సౌత్ మండల కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం కూడలిలో, సీపీఎం వెస్ట్ కమిటీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్శిటీ కూడలిలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణకు వివిధ సందర్భాల్లో చేసిన వాగ్దానాలు, రాష్ట్ర విభజన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన వాటాలు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి లాంటి సంస్థలను పూర్తిగా ప్రైవేటీకరించడానికి కేంద్రం పూనుకుందని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వల్లెపు రాజు, కొమురెల్లి, యాకయ్య, దూడపాక రాజేందర్, కంచర్ల కుమరస్వామి, రమేష్, రాజు, నరేష్, రాణి, సుకర్ణ, రమ, విజయ, రాసమల్ల వెంకటేష్, రవీంద్ర చారి, సరిత, హర్సియా, బిల్ కీస్, రాధిక, రమేష్, శ్రీకాంత్, సుధాకర్ పాల్గొన్నారు.

మోదీకి తెలంగాణలో తిరిగే నైతికహక్కు లేదు

వరంగల్ చౌరస్తా: విభజన హామీలను అమలు చేయని ప్రధానీ మోదీకి తెలంగాణలో తిరిగే నైతిక హక్కు లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. హైదరాబాద్‌లో నరేంద్ర మోదీ పర్యటను నిరసిస్తూ పార్టీ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వరంగల్ హెడ్ పోస్టాఫీసు వద్ద శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేకల రవి మాట్లాడుతూ తెలంగాణ విభజన హామీలైన బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, గిరిజన విశ్వవిద్యాలయం లాంటి విభజన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్మియా జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, సంగి ఎలేందర్, గుండె బద్రి, ప్రజానాట్య మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య నాయకులు ల్యాదల్ల శరత్, జన్ను రవి, పరికిరాల రమేష్, యాకాంబర చారి, విజయలక్ష్మి, పద్మ, యాకూబ్, దేవరాజు, రాజేందర్, ఉమ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలి

కరీమాబాద్: ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలని, పెరిగిన వంటగ్యాస్‌తోపాటు నిత్యావసర ధరలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ వరంగల్ కరీమాబాద్ రోడ్డుపై సీపీఎం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీశ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రధాన మంత్రి మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో షాజియా, ప్రభాకర్, దివ్య, వాణి, మేకల సరిత, జుబేదా, సూరమ్మ, మహబూబ్, ఇస్మాయిల్, యాకూబ్‌పాషా, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో సీపీఎం నాయకుల నిరసన

హసన్‌పర్తి: ప్రధానమంత్రి మోదీ రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో హసన్‌పర్తిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్యకమంలో సీపీఎం నాయకులు ఈర్ల సురేందర్, శ్రీధర్, గొల్లాండ శివ, నాంపెల్లి మౌనిక, ఎండి.అనిషా, అజీమా, లోకిని శ్రీను పాల్గొన్నారు.


కరీమాబాద్‌లో రోడ్డుపై బైఠాయించిన సీపీఎం నాయకులు


హసన్‌పర్తి: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, తదితరులు

రేపు కలెక్టరేట్ ఎదుట నిరసన


మాట్లాడుతున్న కర్రు సుధీర్‌బాబు

వరంగల్: ఈనెల 10న వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కర్రు సుధీర్‌బాబు తెలిపారు. హనుమకొండలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయంలోని ఉమ్మడి జిల్లా పెన్షనర్స్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మొదటి పీఆర్సీ సిఫార్సుల ఉత్తర్వులు జారీ చేయాలని, మూడు డీఏ(డీఆర్)లను ప్రకటించి బకాయిలు నగదుగా చెల్లించాలని, పెన్షనర్లకు నగదు రహిత వైద్య చికిత్సను అందుబాటులోకి తీసుకురావాలని కర్రు సుధీర్‌బాబు డిమాండ్ చేశారు. నెలల తరబడి వివిధ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలని, జూలై 2023 నుంచి తెలంగాణ రెండో పీఆర్సీ వర్తించేలా సత్వరమే చర్యలు చేపట్టాలని సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సదానందం, జిల్లా ఆర్థిక కార్యదర్శి వెలిశోజు రామ మనోహర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు



వరంగల్: ఏనుమాముల పోలీసుస్టేషన్ పరిధిలోని ఆరెపల్లి గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం దాడి చేసి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.15,940 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితులు శ్యాంరావు రాజేష్, బండారి మోహన్, ముసుగు దేవేందర్, ఏనుగు కుమారస్వామిని అరెస్టు చేయగా ముసుగు రమేష్, గొర్రె వెంకటేష్, పెద్దారపు రమేష్ తప్పించుకున్నారని తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని తదుపరి చర్యల నిమిత్తం ఏనుమాముల పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్సైలు నిస్సార్‌పాషా, లవణ్‌కుమార్, శరత్‌కుమార్, ఏనుమాముల ఎస్సై రాజన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా

ఘనంగా స్కూల్ డే

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం పెరకవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని మానస ఆధ్వర్యంలో శనివారం స్కూల్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక దుస్తుల్లో హాజరై నృత్యాలు చేస్తూ ఆటపాటలతో అలరించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు పెరుమాండ్ల సాంబమూర్తి పర్యవేక్షణలో వార్షికోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామానుజయ్య, ఏ.సదయ్య, చంద్రమోహన్‌సింగ్, యాదగిరి పాల్గొన్నారు.

స్నాతకోత్సవ వేడుకలు

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాలలో స్నాతకోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, పాఠశాల డైరెక్టర్ తాళ్ల వంశీ, చైతన్యలతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాకేష్



హసన్‌పర్తి: తెలంగాణ బీసీ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన జంపాల రాకేష్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ ప్రకటించారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు రాకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

సినీహీరో అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు

హన్మకొండ చౌరస్తా: అల్లు అర్జున్ ఫ్యాన్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సినీ నటుడు అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను హనుమకొండలోని అమృత థియేటర్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు కరాటే ప్రభాకర్, అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అచ్చుకట్ల రమేష్, సిటీ ప్రెసిడెంట్ జనగాని శంకర్, రతన్‌గౌడ్, రాహుల్, నాగేందర్, మోహన్, కృష్ణ, బిట్టు, శ్రీధర్, సతీష్, జైక్రిష్ణ, సురేష్, సత్య, శివ, రాజేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



హన్మకొండ: హైదరాబాద్‌లోని ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు బీజేపీ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈమేరకు వాహన శ్రేణిని హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్ వద్ద పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జితేందర్ రెడ్డి, నాయకులు గుజ్జుల మహేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జన్ను మధు పాల్గొన్నారు.

కాజీపేట: హైదరాబాద్‌లో ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు తరలివెళ్తున్న బీజేపీ కార్యకర్తల వాహన శ్రేణిని మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చాడ శ్రీనివాస్ రెడ్డి, నార్లగిరి రామలింగం, రాజా మహేంద్రన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'రన్ ఫర్ జీసస్'


కాజీపేటలో రన్ ఫర్ జీసస్‌ను ప్రారంభిస్తున్న బిషప్ మార్కండేయ


హసన్‌పర్తి: రన్ ఫర్ జీసస్ ర్యాలీ

కాజీపేట: కాజీపేట పట్టణంలో శనివారం రన్ ఫర్ జీసస్ వేడుకలను బిషప్ జాన్ మార్కండేయ జెండా ఊపి ప్రారంభించారు. ఈస్టర్ పర్వదిన వేడుకలను పురస్కరించుకుని టీసీఎఫ్ – డబ్ల్యూజీఎల్ ఆధ్వర్యంలో 5 కిలోమీటర్ల రన్‌లో క్రైస్తవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నల్ల డేవిడ్, అయ్యాల దానం, లాజరస్, ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో..

హసన్‌పర్తి: లివింగ్ ఏ జీ పాస్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. భీమారంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం కేయూసీ క్రాస్ మీదుగా హనుమకొండలోని సెంటనరి బాప్టిస్ట్ చర్చి వరకు సాగింది. తొలుత ర్యాలీని స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు సంగాల విక్టర్‌బాబు, పాస్టర్లు జోసఫ్ ప్రభాకర్, బెంహర్, ముత్తయ్య, సంగ రాజు, సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, కార్యదర్శి వీనస్ పాల్గొన్నారు. అలాగే, వంగపహాడ్, అర్వపల్లి, నాగారం, హసన్‌పర్తి, అన్నాసాగరం, సీతంపేట, దేవన్నపేట, కోమటిపల్లిల్లో ర్యాలీ నిర్వహించారు.

సైకాలజిస్టుల అసోసియేషన్ కమిటీల ఎన్నిక


కమిటీని ప్రకటిస్తున్న మురళీధర్‌రావు

న్యూశాయంపేట: సైకాలజిస్టుల అసోసియేషన్ వరంగల్, హనుమకొండ జిల్లాల కమిటీలను ఎన్నుకున్నారు. తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టీపీఏ) వరంగల్ జిల్లా నూతన కమిటీని సైన్స్ సెంటర్‌లో అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి మురళీధర్ రావు ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.మిధున్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా కె.సృజనారెడ్డి, ఎస్.నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బొజ్జ సురేష్, సహాయ కార్యదర్శులుగా పోగు అశోక్, జి.గోవర్దన్, కోశాధికారిగా శ్రీనివాస్, సభ్యుడిగా రంజిత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హనుమకొండ ప్రతినిధి శ్యామ్ సుందర్‌రెడ్డి ఉన్నారు.

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ హనుమకొండ జిల్లా నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా డాక్టర్ గంగిశెట్టి శ్రీవిద్య, ప్రధాన కార్యదర్శిగా శ్యాం సుందర్, ఉపాధ్యక్షుడిగా శివుడు, ఉప కార్యదర్శిగా దామోదర్, కోశాధికారిగా ఈసీ మెంబర్లు శంకర్, సునీత, మురళీధర్, దేవేందర్, స్నేహ, సాజియాతో పాటు ఎన్నుకున్నారు.

ప్రపంచ మానవాళి రక్షకుడు ఏసుక్రీస్తు


సందేశం ఇస్తున్న బిషప్ ఉడుముల బాల

కాజీపేట రూరల్: ప్రపంచ మానవాళి రక్షకుడు ఏసుక్రీస్తు అని ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల అన్నారు. ఈస్టర్ దినోత్సవంలో కాజీపేట ఫాతిమానగర్ కేథడ్రల్ చర్చిలో భాగంగా శనివారం అర్ధరాత్రి పాస్క జాగరణ మహోత్సవాల్లో ఉడుముల బాల ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిని వెలిగించి దూపం వేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు తనను తాను తగ్గించుకొని ప్రజల పట్ల ప్రేమ, దయ చూపారో అదే విధంగా నిజ జీవితంలో ఆయన మార్గం, బోధనలను తామందరం అనుసరించాలని సూచించారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని తరలివచ్చిన క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తును ఆరాధించారు. కార్యక్రమంలో కేథడ్రల్ చర్చి విచారణ గురువు కాసు మర్రెడ్డి, ఫాదర్లు, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గోవిందరాజుల రథోత్సవం


పుర వీధుల్లో కొనసాగుతున్న రథోత్సవం

వరంగల్ చౌరస్తా: గోవిందరాజ స్వామి పెద్ద రథోత్సవం వైభవంగా సాగుతోంది. మూడవరోజు శనివారం వరంగల్‌లోని గిర్మాజీపేట సత్య హాస్పిటల్ వరకు రథయాత్ర చేరుకుంది. డప్పు వాయిద్యాలతో కళాకారుల కోలాట ఆటపాటలతో పురవీధుల్లో పెద్దరథాన్ని రథసారథులు ముందుకు తీసుకెళ్లారు. బీఆర్ఎస్ నాయకులు కూచన క్రాంతి కుమార్, మట్టెవాడ ఆనంద్ రావు మిత్రులు అన్నదానం చేశారు. కార్యకమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు చింతాకుల సునీల్ కుమార్, ముదిరాజ్ వంశీయులు ఇప్ప ఆదినారాయణ, పరశు శ్రీనివాస్, సింగినేని శ్రీనివాస్, గోవిందు, రాధాకష్ణ, నరహరి, వంశీ, సాగర్, ఈశ్వర్, శివ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఓంప్రకాశ్

కాజీపేట: గంగపుత్రులపై దాడి చేసి గాయపర్చిన ముదిరాజ్ కులస్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర (బేస్త) సంఘం జిల్లా అధ్యక్షుడు పాక ఓంప్రకాశ్ డిమాండ్ చేశారు. కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా ముత్తాయిపేట గ్రామంలో సొంత హక్కులు కలిగిన చెరువులో దౌర్జన్యంగా ముదిరాజ్‌లు చేపలు పట్టడానికి ప్రయత్నించడమే గాక గంగపుత్రులపై దాడి చేసి గాయపర్చడం అన్యాయమని వాపోయారు. పోలీసులు వెంటనే స్పందించి బాధ్యులను గుర్తించి శిక్షించాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాక వెంకటేశ్వర్లు, డైరీ కమిటీ కన్వీనర్ డాక్టర్ గోపు సుధాకర్, కె.వేదప్రకాశ్, ఎ.శ్రీనివాస్, పి.సదానందం, గోపాల్ రావు, కె.రఘు, క్రాంతికుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (హన్మకొండ)

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com